
# మూసీ

# MUSI

• Samputi : 22 • Sanchika : 10 • Pages : 60 • Rs. : 20
• August 2020

* మూసీ సాహిత్య ధార
* తెలుగు కథాగేయ కవిత్వం
* బహుముఖ ప్రజ్ఞాశాలి 'సురవరం'
* రాకాసిగుళ్ళు
* డా. తిరునగరి గారితో మూసీ ముచ్చట
* భవభూతి ఉత్తర రామచరితం - పునః పరిశీలన
* ఆరోగ్య ప్రదాయిని శీతలాదేవి
* పీ.వి.విశాల దృక్పథం - దూరదృష్టి
* విశ్వనాథ సాహిత్య దర్శనం - 31





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 22 సంచిక : 10
ఆగస్టు - 2020
'శార్వరి' శ్రావణ మాసం
సంపాదకులు
సాగి కమలాకర శర్మ

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 9347971177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

మూసీ సాహిత్య ధార 6
తెలుగు కథాగేయ కవిత్వం ... ఘట్టమరాజు 7
బహుముఖ ప్రజ్ఞాశాలి 'సురవరం' ... డా. రాపోలు శ్రీనివాస్ 13
రాకాసిగుళ్ళు (కథాకథనం) ... డా. పేట శ్రీనివాస్ రెడ్డి 17
మూసీ పదవినోదం - 20 ... డా. తాడేపల్లి పతంజలి 20
డా. తిరునగరి గారితో మూసీ ముచ్చట ... అట్టెం దత్తయ్య 21
భవభూతి ఉత్తర రామచరితం - పునఃపరిశీలన... ఆచార్య బి. నరసింహాచార్య 25
ఆరోగ్య ప్రదాయిని శీత్లాదేవి ... ఆచార్య సూర్యాధనంజయ్ 29
పీ.వీ. విశాల దృక్పథం - దూరదృష్టి ... డా. వొజ్జల శరత్‌బాబు 33
పద్య మనోహరం -12 ... డా॥ గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 36
విశ్వనాథ సాహిత్య దర్శనం - 31 ... డా. జె. భారతి 37
సాహితీ వంతెన 'మంతెన' ... డా. అమ్మిన శ్రీనివాసరాజు 41
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 5 ... టి. లక్ష్మీనారాయణ 43
తెలంగాణ యోగులు...శ్రీ మల్యాల గురవయ్య ... డా. రంగి కమల 47
భారతీయ సంగీతం - 45 ... సామల రాజవర్ధన్ 49
శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 53
దాశరథి రంగాచార్య రచనలు - వైవిధ్యం ... డా. కె. సుభాష్ చంద్ర బోస్ 57
భారవి గొడుగు, మాఘుని గంటలు ... డా. శ్రీరంగాచార్య 61

### కవితలు

వార్ధక్య చింతన ... దోరవేటి - 5; తుకారాం అభంగం ... అను : మంత్రి శ్రీనివాస్ - 6; సానుభూతి ... డా. ఏనుగు నరసింహా రెడ్డి - 12; సరం బడ్డది ... డా. ఎన్. గోపి - 15; అమ్మే గెలిచింది ... బి. నాగేశ్వర రావు - 19; తిరునగరికి అభినందన ... డా. రాధశ్రీ -23; ఏకాదశి ... కర్నాటి రఘురాములు గౌడ్ - 24; నేను ... సామల కిరణ్ -24; తండ్రి వేదన ... డా. కందుల శ్రీను - 26; హీరోలు ఎవరో తెలిసిపోయింది ... యడవల్లి సైదులు - 35; ఖాళీలు పూరించడానికి ... దిలీప్ - 39; విద్వన్మూర్తి ... కమలేకర్ శ్యాంప్రసాద రావు - 39; నమ్రతగా మాట్లాడు ... కట్టా రాజమౌళి - 40; ఎలా? ఎందుకు? ఏమిటి? ... డా. ధారావత్ సంతోష్ కుమార్ - 40; రక్షానుబంధం ... సాగర్ రెడ్డి - 48; పేరులేని సినిమా ... తండ హరీష్ గౌడ్ - 48; కేనోపనిషత్తు ... జక్కని వెంకటరాజం - 51; నాన్న మొగ్గలు ... డా. భీంపల్లి శ్రీకాంత్ - 52;

### సమీక్షలు

దళిత జీవన సంఘర్షణకు ప్రతిబింబం ... పెద్దపల్లి తేజస్విని 55
స్వీకృతి ... 62


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor* : **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

# బహుముఖ ప్రజ్ఞాశాలి 'సురవరం'

డా. రాపోలు శ్రీనివాస్, తెలుగు అధ్యాపకులు, నల్లగొండ. ఫోన్ : 98480 50694

తెలంగాణ ప్రాంతంలో ప్రతిభ ఎన్నడూ ప్రచారం కోరుకోలేదనీ, పల్లకీల కంటె పల్లెడు మెతుకుల ప్రశాంతతను కోరుకుందనీ, ఏనాడైనా తెలంగాణవాడు వెనుకబడలేదనీ, ఆత్మాభిమానం గల తెలంగాణ భూమి పుత్రులు అన్ని రంగాలలో అడుగుముందుకు వేయగలరనీ నిరూపించిన తెలంగాణ బిడ్డ సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ చైతన్యం చాటడానికి అహరహం తపించినవాడు సురవరం. గ్రంథాలయాలు, పత్రికలు స్థాపించి తెలంగాణ చరిత్రను వెలికితీసి సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారకుడైనాడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్షరబాణాలు సంధిస్తూ అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణ ప్రజల్లో రాజకీయ చైతన్యదీప్తిని రగిలించిన తెలంగాణ వైతాళికుడు సురవరం. తలవంచని జర్నలిజానికి తలమానికంగా నిలుస్తూ రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరిస్తూ, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి కలం ఎక్కుపెట్టి తనదైన శైలిలో తుపాకీ తూటాల్లాంటి అక్షరాలను పత్రికల్లో సాలుపోస్తూ, అక్షరానికి ఉన్న అక్షయశక్తిని బుజువుపరిచినవాడు ప్రతాపరెడ్డి.



### బహుముఖ ప్రజ్ఞాశాలి

సురవరం ప్రతాపరెడ్డి పత్రికా సంపాదకుడిగా, ఆంధ్రమహాసభ అధ్యక్షుడిగా, విద్యాలయాల నిర్మాతగా, పరిశోధకుడిగా, పరిష్కర్తగా, విమర్శకుడిగా, సంఘసంస్కర్తగా, గ్రంథ సంకలనకర్తగా, పండితుడిగా, రచయితగా, తెలుగు భాషోద్ధారకునిగా, రెడ్డిహాస్టల్ నిర్వాహకుడిగా, హైదరాబాద్ అసెంబ్లీ ఎమ్మెల్యేగా, కార్యదీక్షకుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా ఇలా అనేక పాత్రల్ని ఏకకాలంలో పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన తలపెట్టిన కార్యక్రమాలన్నీ ఏ తరానికైనా ఆదర్శప్రాయాలు.

సురవరం ప్రతాపరెడ్డిగారు మే 28, 1896న మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాల సంస్థానంలోని ఇటిక్యాలపాడు గ్రామంలో సురవరం నారాయణరెడ్డి, రంగమ్మ దంపతులకు జన్మించారు. కర్నూలులో ప్రాథమిక విద్య, నిజాంకాలేజీలో ఇంటర్‌విద్య పూర్తిచేసి, మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ., తిరువాన్కూరులో బి.ఎల్ చదివారు. కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించారు. అనేక భాషలు అభ్యసించారు. ఈ సమయంలోనే జాతీయోద్యమ భావాల్ని అలవర్చుకొని హైదరాబాద్ రాష్ట్ర నిజాం రాజ్యంలో ప్రజల దుస్థితిని మార్చాలను కున్నారు. ప్రతాపరెడ్డి తన చదువు పూర్తికాగానే హైదరాబాద్ కొత్వాల్‌గా ఉన్న రాజబహదూర్ వేంకట్రామారెడ్డి ఆధ్వర్యంలోని రెడ్డిహాస్టల్ నిర్వహణ కోసం ఆయన కోరికపై వచ్చారు. అక్కడ పదేళ్ళ కాలం పనిచేసి రెడ్డిహాస్టల్‌ను ఒక విద్యాలయంగా తీర్చిదిద్దారు. అక్కడ 11వేల పుస్తకాలతో గ్రంథాలయాన్ని అభివృద్ధిపరచి తెలుగుభాషా, సాహిత్యాభివృద్ధికి కృషి చేశారు. నాటి విద్యార్థులలో దేశభక్తి బీజాలను నాటారు. ప్రతాపరెడ్డిగారి ప్రభావంతో హైదరాబాద్ కేంద్రంగా చాలా కుల సంఘాలు తమ కులం విద్యార్థుల కోసం హాస్టళ్ళను ప్రారంభించాయి. పద్మశాలి, మున్నూరుకాపు, వైశ్య, గౌడ, వెలమ, పెరిక, వీరశైవ హాస్టళ్ళు సురవరం స్ఫూర్తితోనే ప్రారంభించబడ్డాయి.

### 'గోలకొండ పత్రిక' స్థాపన

తెలంగాణలో కవులే లేరని అన్న ముడుంబై వెంకట రాఘవాచార్యుల హేళన మాటలను సవాలుగా తీసుకొని 354 మంది కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన గొప్ప పరిశోధకుడు. సురవరం గోలకొండ పత్రిక ద్వారా తెలుగుభాషా సాహిత్యోద్యమాన్ని ఉత్తేజింప చేయడమే కాకుండా, కొడిగట్టిపోయిన సాంఘిక చైతన్యాన్ని రగిల్చారు. ఈ సంచికలో 354 మంది పండితుల పేర్లు, పద్యాలు, ఫోటోలు సైతం ప్రచురించారు. ఇందులో 237 సంస్కృత శ్లోకాలు, 1418 తెలుగు పద్యాలు ఉన్నాయి. 23 సంవత్సరాలు గోల్కొండ పత్రికకు సంపాదకత్వం వహించి 15 వందలకు పైగా వ్యాసాలు రాశారు. ఆనాటి గోల్కొండ కార్యాలయం సాహితీ నిలయంగా మలచబడి, విద్యావంతుల సాహితీ చర్చలతో కళకళలాడేది.

కొత్వాల్ వెంకటరామారెడ్డిగారు సురవరంవారి సేవలు తెలుగు భాషా సాహిత్యాలకు అవసరమని భావించి మాడపాటి హనుమంత రావుగారి సహకారంతో 1926లో గోలకొండ పత్రిక స్థాపించడం జరిగింది. దాని బరువుబాధ్యతలను ప్రతాపరెడ్డిగారికి అప్పగించారు. సురవరం తన సంపాదకీయాల ద్వారా నిజాం దురాగతాలను నిలదీసేవాడు. తనను సూటిగా ప్రశ్నించినందుకు నిజాం ఆగ్రహించి సమాచారశాఖ అనుమతితోనే సంపాదకీయాలను ప్రచురించాలని నిబంధన విధించాడు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాపరెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయాలకు బదులుగా ప్రచురించి నిజాంను ఎదురించాడు.

తెలుగు మాట్లాడడమే నేరమైన చోట తెలుగుపత్రిక వెలిసింది. ఈ పత్రికా సంపాదకునిగా సురవరం ప్రతాపరెడ్డి పీడిత ప్రజలకు అండగా నిలిచాడు. అనేక ప్రజాహిత ఉద్యమాలకు పురుడు పోశాడు. ఎక్కడ ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా ఎదిరించాడు. రాజకీయ ఉద్యమాల స్ఫూర్తితో ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం కృషి చేశాడు. అందులో భాగంగానే రాజకీయ స్వత్వములు రాశాడు. స్వత్వములు అంటే హక్కులు అని అర్థం. వివిధ దేశాలలో ప్రజలకు ఎలాంటి హక్కులు ఉన్నాయి, వాటిని సాధించుకోవడానికి వారు చేసిన కృషి ఎలాంటిది, అలాంటి హక్కులు మెరుగైన సమాజ నిర్మాణానికి ఎలా తోడ్పడుతున్నాయో ఈ పుస్తకం చెబుతుంది.

**బహుముఖ సాహితీవేత్త :**

సురవరం ప్రతాపరెడ్డి సాహితీవేత్తగా అనేక ప్రక్రియలలో రచనలు చేశాడు. గోలకొండ పత్రిక నిర్వహణలో తలమునకలై ఉండికూడా తెలంగాణ ఔన్నత్యాన్ని చాటే వ్యాసాలు రాసి, పరిశోధనలు చేసి ఆదర్శంగా నిలిచాడు. సురవరం ఏదో ఒక ప్రక్రియలోనే కాకుండా కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, సాహిత్య విమర్శ, అనువాదం, పత్రికారచన ఇలా అన్నింటితోనూ రచనా వ్యాసంగం కొనసాగించారు. సంస్కృతం, ఉర్దూ, ఫార్సీ, ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషలలో ప్రావీణ్యం ఉన్నా, భాషాసేవకుడుగా తెలుగుకు సేవచేశాడు. ప్రతాపరెడ్డి భావుకుడైన రచయిత. కవితలు, కథలు, వ్యాసాలు రచించాడు. సురవరం కథలు నిజాంకాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రిస్తాయి. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, గ్రంథాలయోద్యమము, రామాయణకాలం నాటి విశేషాలు ఇతని ముఖ్య రచనలు. భక్త తుకారాం, ఉచ్చల విషాదము అనే నాటకాలు రాశాడు. మొగలాయి కథలు, మామిడిపండు, మీసాల కృష్ణుడు, నిజాం రాష్ట్రపాలన, లిపి సంస్కరణ వంటి విషయాలను గురించి ఎన్నో రచనలను చేసారు. మొగలాయి కథలలో ముఖ్యంగా అధికారుల లంచగొండితనం, క్రౌర్యం, ప్రజలను పీడించడం, దుష్టపాలన, ప్రజల నిస్సహాయతా, మూఢాచారాల నిరసన, అమాయకత్వాలను కళ్ళకు కట్టించారు. 'సురవరం కథలు'లో ఎక్కువగా స్త్రీల బాధలను, సమాజంలోని వారి స్థితిగతులను తెలియజేశాడు. స్త్రీలను నమ్మించి వేశ్యాగృహాలకు అమ్మడం, బాల్యవివాహాలు, మతమార్పిడులు, స్త్రీజన ఉద్ధరణ లాంటివే ఈ కథలలో కనిపిస్తాయి. ఈ విధంగా తెలుగుభాషాభివృద్ధికి ఎనలేని సేవచేశాడు. 1955లోనే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకుగాను "కేంద్ర సాహిత్య అకాడెమి" అవార్డు లభించింది. ఇది ఒక అద్భుత పరిశోధక గ్రంథం.

రాజుల కాలంలోని సామాన్య ప్రజల జీవన విధానాలను పరిశోధించి, చర్చించి చరిత్రరచనకు కొత్త నిర్వచనం చెప్పిన గ్రంథమిది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో తన రచనల ద్వారా సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకొని వారి జీవన విధానంలో మెరుగైన మార్పులు తీసుకురావడానికి సురవరం ప్రయత్నించాడు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి సారిగా కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు పొందిన ఖ్యాతి సురవరం ప్రతాపరెడ్డిగారికే దక్కుతుంది. సాహిత్యం ద్వారా సాంఘిక జీవనాన్ని నిరూపించడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

**సామాజిక కృషి**


సురవరం భాషా, సాహిత్య కృషికన్నా మించినది ఆయన సామాజిక కృషి మహత్తరమైనది. చాలా కార్యక్రమాలకు ఆయనే ప్రారంభకుడు. చాలా కార్యక్రమాలలో ఆయనే నాయకుడు, ప్రధాన కార్యకర్త. మరెన్నో కార్యక్రమాలకు ఆయన మేధాపరమైన, నైతిక పరమైన సహాయ సహకారాలు అందించారు. నైజాం నిరంకుశ పాలనలో, తెలుగువారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగుభాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశాడు. అన్యాయాన్ని సహించని అసలు సిసలైన తెలంగాణాభిమాని ప్రతాపరెడ్డి. జీవిత చివరి దశలో రాజకీయాలలో కూడా ప్రవేశించి వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడు. 1952లో హైదరాబాదు రాష్ట్రానికి జరిగిన మొదటి ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తరపున వనపర్తి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. ప్రముఖ న్యాయవాది వి. రామచంద్రారెడ్డిపై విజయం సాధించాడు. కాని జిల్లా వ్యక్తి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి కినీ ఇతనికి మంత్రిపదవి కూడా లభించలేదు. దానికి కారణం సురవరం గారికి గ్రూపు రాజకీయాలంటే గిట్టదు గనుక. ఇదే విషయాన్ని అప్పుడైన రంగాచార్యులకు లేఖరాస్తూ "ఈ రాజకీయపు చీకటి బజారులో నేను, నావంటివారు ఏమియును పనికిరారు" అని పేర్కొన్నాడు. రాజకీయ రంగంలో ఇంతటి మేధావి, వ్యవహర్త నిలదొక్కుకోలేక పోయాడంటే రాజకీయ రంగం కేవలం చాణక్యశీలురకే సరిపోయే రంగమనే భావించాలి.


### ఆంధ్ర మహాసభ

తెలుగు మాతృభాష దుస్థితిపై సురవరంవారు ఎంతగానో వ్యాకులపడ్డారు. 'తెలంగీ-బేడంగీ' అని తెలుగును ముక్కు మొఖంలేని భాషగా హేళన చేస్తున్నవేళ, చేవతో తెలుగు సాహిత్యానికి సేవచేసిన సాహితీమూర్తి సురవరం. హైదరాబాద్ సంస్థానంలో భాషాపరంగా, రాజకీయంగా మనం బలహీనులమై పోయామని, ఈ దుస్థితి రావడానికి లోపాలను కనుక్కోవాలని తపనపడ్డాడు. ఉర్దూ భాషతో రాజ్యమేలుతున్న హైకోర్టులోను, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోను తెలుగు భాషకు చుక్కెదురు కావడాన్ని ఆయన నిరసించారు. నూటికి 90శాతం ఉన్న తెలుగు ప్రజలకు ఉర్దూభాషను విద్యాలయాలలో బోధనాభాషగా బలవంతంగా రుద్దుతుండడాన్ని ఆయన తప్పుపట్టాడు. ఓ సమావేశంలో తెలుగువాళ్లు తెలుగులో మాట్లాడకూడదని హేళన చేసినందుకు అది భాషకు, తెలుగు సంస్కృతికి జరిగిన ఘోర అవమానంగా భావించి మిత్రులతో కలిసి రాత్రికిరాత్రే 'ఆంధ్ర జన సభ' ఏర్పాటు చేశాడు. ఇదే నాడు సుప్రసిద్ధమైన, 'ఆంధ్ర మహాసభ'గా మారి, వరుసగా తెలంగాణలో పదమూడు సభలు నిర్వహించింది. తెలంగాణాలో రాజకీయ చైతన్యం తేవడంలో ఈ సంస్థ పాత్ర గణనీయమైంది. ఈ ఆంధ్రమహాసభ అందించిన చైతన్యమే నిజాం పాలన అంతానికి నాంది పలికింది. 1930లో జోగిపేటలో జరిగిన మొదటి ఆంధ్రమహాసభకు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించి తెలుగుభాషాభివృద్ధికి, బాల్య వివాహాల నిర్మూలనకు తీర్మానాలు చేయించాడు.

### గ్రంథాలయోద్యమం

తెలంగాణాలో గ్రంథాలయోద్యమంలో ప్రముఖపాత్ర వహించాడు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించాడు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు అధ్యక్షులుగా ఉన్నాడు. 1951లో ప్రజావాణి అనే పత్రికను ప్రారంభించాడు. న్యాయవాదిగా జీవితం ప్రారంభించి, రచయితగా, కార్యకర్తగా, సంపాదకుడిగా జీవితం సాగించి తెలంగాణ ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేసుకున్నాడు. ఆకాశవాణిలో ఎన్నో అమూల్య ప్రసంగాలు చేశాడు. ఇతనికి తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ సంస్కృతిపట్లగల అభిమానమే, ఆచార్య బిరుదురాజు రామరాజుగారిని తెలుగు జానపద గేయాలపై పరిశోధనకు పురిగొల్పింది. కేవలం 58 సంవత్సరాలు మాత్రమే జీవించిన వీరు 1953 ఆగష్టు 25న దివంగతుడైనాడు. తెలంగాణ తేజోమూర్తులలో అగ్రేసరుడైన సురవరం ప్రతాపరెడ్డి ధన్యజీవి.







---

## సరం బడ్డది

హఠాత్తుగా సరం బడ్డది
అన్ననాళిక తట్టుకోవడం కాదు
మనసుకే ఏదో అడ్డం పడ్డది



దూరాన ఆత్మీయులెవరైనా
యాజ్జేసిండ్రా!
మరిచిపోయిన నా దొల్ల మనసును
తలచుకొని తల్లడిల్లిండ్రా!
ఏదో జరిగింది
నాకిక్కడ సరం బడ్డది

పొద్దుటినుంచి బాగానే వున్న
చాయ తాగిన
పేపర్ చదివిన
అప్పటినుంచే
పుల్కరం లాంటి ఫీలింగ్
శ్వాస ఆగిపోయినంత పనయ్యింది
కండ్లు ఉబ్బి
ఊడిపడతాయేమోనన్న భావన

నెత్తిమీద కొట్టినా
వెలికిరాని
లోపలికి దిగని సందిగ్ధ పరిస్థితి
మెల్లగా అర్థమౌతున్నది
ఎక్కడో ఏదో జరగరానిది జరిగింది
మానవత్వం మంట గలిసింది
బహుశా ఓ రైతు
ఉరితాడుకు వేల్లాడుతూ
కొన ఊపిరితో చేసిన ఆర్తనాదాలు
గాలిని గాయపరిచాయి
అందుకే సరం బడ్డది

(నూటెంకి రవీంద్రకు)

- డా. ఎన్. గోపి